సాక్షి
రంగారెడ్డి
గురువారం । 27 । జూలై । 2023



అన్నదాతకు బీమా ధీమా

కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రైతు బీమా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 8లో▸



ఉద్యాన పంటలకు అనువు

పండ్ల తోటలు, కూరగాయల సాగుకు జిల్లా అనువైన ప్రాంతమని జిల్లా అధికారి డాక్టర్ సునందారెడ్డి అన్నారు. 8లో▸



కోళ్ల వ్యాన్ బోల్తా

డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా కోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. 8లో▸

న్యూస్‌రీల్

దోచుకోవడం తప్ప బీఆర్ఎస్ చేసిందేమీ లేదు



నందిహిల్స్‌లో రోడ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

మీర్‌పేట: అభివృద్ధి పేరిట దోచుకోవడం తప్ప బీఆర్ఎస్ పాలకులు చేసిందేమీ లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నందిహిల్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వనగరం, మరో సింగపూర్ అని గొప్పలు చెబుతున్న మంత్రి కేటీఆర్‌కు నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని రోడ్ల దుస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, శ్రీశైలం, యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి, పద్మశ్రీ, కాల్వ కృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎరుకల మురళీగౌడ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవిశ్వాసంపై హైకోర్టు స్టే



స్టే ఉత్తర్వుల కాపీని ఆర్డీఓకు అందజేస్తున్న ఎంపీపీ

ఆమనగల్లు: ఎంపీపీ అనితపై ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆగస్టు 2న ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మాన సమావేశం నిలిచిపోయింది. వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, సరిత పంతునాయక్, నిట్టె మంగమ్మ తదితరులు అవిశ్వాసం ప్రకటిస్తూ ఈనెల 5న కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు నోటీసు అందించారు. ఈ విషయమై చర్చించేందుకు ఆగస్టు 2న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యులందరికీ ఆర్డీఓ నోటీసులు జారీచేశారు. దీంతో ఎంపీపీ అనిత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అవిశ్వాస తీర్మానంపై నోటీసులు జారీ చేసేందుకు ఆర్డీఓకు ఎలాంటి అధికారం లేదని కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు 2న నిర్వహించాల్సిన మీటింగ్‌పై హైకోర్టు న్యాయమూర్తి బి.విజయసేన్‌రెడ్డి స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల కాపీని ఎంపీపీ ద్వారా బుధవారం కందుకూరు ఆర్డీఓకు అందజేశారు.

భార్య మరణాన్ని జీర్ణించుకోలేక..

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

పహాడీషరీఫ్: భార్య మరణాన్ని జీర్ణించుకోలేక తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ మహబూబ్ అలీ(55) భార్య ఆరు నెలల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి షేక్ మహబూబ్ అలీ తాగుడుకు బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఎప్పటిలాగే మద్యం తాగి ఇంటికి రావడంతో కుమారులు మందలించారు. దీంతో మహబూబ్ అలీ తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో మరో వ్యక్తి..

ఆరోగ్యం సరిగ్గా లేని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జల్‌పల్లి శ్రీరాంనగర్ కాలనీకి చెందిన సాయి ప్రసాద్(23) రెండు నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా సమస్య తీరలేదు. దీంతో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏసీబీ వలలో లైన్‌ఇన్‌స్పెక్టర్

లాలాపేట: ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను మార్చేందుకు రూ.6 వేలు లంచం తీసుకుంటూ లైన్‌ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన సంఘటన బుధవారం తార్నాకలో చోటుచేసుకుంది. లాలాగూడలోని టీఎస్‌ఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లుకు అదే ప్రాంతంలో మహ్మద్ షాహిద్ అలీ తన ఇంటికి ఉన్న కమర్షియల్ విద్యుత్ కనెక్షన్‌ను డొమెస్టిక్ కేటగిరిగా మార్చాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. దరఖాస్తును పెండింగ్‌లో పెట్టడంతో షాహిద్ అలీ ప్రశ్నించగా రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు లైన్‌ఇన్‌స్పెక్టర్ రూ.6వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ప్రకృతి కనువిందు





మంచాల- బోడకొండ మార్గంలో వర్షాలకు నెమళ్లు కనువిందు చేశాయి.. పురివిప్పి నాట్యమాడుతూ చూపరులను ఆకట్టుకున్నాయి.



వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరినాట్లు వేస్తున్న మహిళలు



అక్షయ పాత్ర 59

అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న క్రమబద్ధీకరణ జీఓ

- ప్రభుత్వ స్థలాల్లో వాలిన పెద్దలు
- రెగ్యులరైజేషన్ పేరుతో అన్యాక్రాంతం
- నేతలు, వారి బంధువుల పేరున 59 జీఓ కింద దరఖాస్తులు
- పొజిషన్‌లో లేకపోయినా ఉన్నట్లు ధ్రువీకరణ
- 'మామూలు'గా సాగుతున్న రెవెన్యూ తనిఖీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పేదలు నివసించే ఇళ్లు, స్థలాల రెగ్యులరైజేషన్ కోసం సర్కారు తీసుకువచ్చిన జీఓ 59.. పలువురు నేతలు, అధికారులకు అక్షయ పాత్రగా మారింది. ఇదే అదనుగా భావించిన వీరు ప్రభుత్వ ఖాళీ స్థలాలపై కన్నేశారు. నిర్మాణాలు లేని చోట ఇళ్లు ఉన్నట్లు.. కరెంటు లేని చోట మీటర్లు జారీ చేసినట్లు.. పంచాయతీకి ఇంటి పన్నులు సైతం చెల్లించినట్లు తప్పుడు రశీదులు సృష్టించారు. వీటి ఆధారంగా.. కొంతమంది నాయకులు తమతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరుల పేరున భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. తనిఖీలకు వచ్చిన రెవెన్యూ అధికారులకు అడిగినంత ముట్టజెప్పి.. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారు.

పసుమాముల కేంద్రంగా..

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 102, 106, 137, 267, 386/4 నుంచి 386/12, 413, 444లలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో రెవెన్యూ అధికారులు నోటీసు బోర్డులు కూడా పెట్టారు. ఈ స్థలానికి బహిరంగ మార్కెట్లో గజానికి రూ.25 వేలకుపైగా ధర పలుకుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధికి ప్రధాన అనుచరుడిగా చెప్పుకొంటున్న ఓ స్థానిక నేత కన్ను వీటిపై పడింది. ఖాళీగా ఉన్న ఈ భూములను ఎలాగైనా చేజిక్కించుకోవాలని భావించాడు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 59ను అనుకూలంగా మలుచుకునే కుట్రకు తెరతీశాడు. ఆయా భూముల్లో ఏళ్ల తరబడి తామే పొజిషన్‌లో ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. తన పేరుతో పాటు భార్య, కొడుకు, తల్లి, తండ్రి, తోడల్లుడు, మరదలు, డ్రైవరు ఇలా సపరివారం, బంధువుల పేరున ఎకరాల్లో ఉన్న భూమిని గుంటలు, గజాల్లోకి మార్చారు. ఒక్కో వ్యక్తి పేరున ఒక్కో సర్వే నంబరులో రెండు, మూడు ప్లాట్లు ఉన్నట్లు రికార్డులు సృష్టించారు. ఒక్కో వ్యక్తి పేరున 1,500 నుంచి 2,500 గజాల వరకు ఉన్నట్లు నోటరీ డాక్యుమెంట్లు రూపొందించారు. ఈ మేరకు ఆయా వ్యక్తుల పేరున జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఆయన ఒక్కరే పది వేల గజాలకుపైగా కొల్లగొట్టేందుకు యత్నిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఫ్యామిలీ ప్యాక్‌గా రెగ్యులరైజేషన్

జీఓ నంబర్ 59 కింద ఒక్క పసుమాముల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వానికి 218 దరఖాస్తులు రాగా 186 అప్లికేషన్లు ఖాళీ స్థలాలకు సంబంధించినవే కావడం విశేషం. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన అధికారుల చేతులు తడిపి, జిల్లా స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి క్రమబద్ధీకరణ పేరుతో తక్కువ రేటుకు స్థలాలను కొల్లగొడుతున్నట్లు తెలుస్తోంది.

ఎవరి వాటా వారిదే!

తట్టి అన్నారం రెవెన్యూ సర్వే నంబర్ 106లోని ప్రభుత్వ భూమిని ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు కలిసి కొల్లగొట్టారు. స్థలాల క్రమబద్ధీకరణలో వాటాలు మాట్లాడుకుని ఈ తతంగాన్ని నడిపించారు. ఆమనగల్లు రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 40లోని 22 గుంటల భూమిని ప్రభుత్వం గతంలో జీహెచ్ఎంసీకి కేటాయించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, ఇతరులు కలిసి ఈ భూములను కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారు. సర్వే నంబరు 60లోని భూమికి పాత తేదీలతో స్టాంప్ పేపర్లు, నోటరీలు సృష్టించి రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నం.71లోని భూమిపై ఇప్పటికీ కోర్టులో కేసు నడుస్తోంది. ఇందులోనూ అర్జీలు పెట్టుకున్నారు. సర్వే నం. 255లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇక్కడి నిర్మాణాలకు ఆగమేఘాలపై కరెంట్ మీటర్లు జారీ అవుతున్నాయి. జీహెచ్ఎంసీ నుంచి ఇంటి పన్ను రసీదులు పుట్టుకొస్తున్నాయి. మునుగనూరు సర్వే నంబర్ 90లోని స్థలాల క్రమబద్ధీకరణలోనూ ఇదే తంతు సాగుతోంది.

తహసీల్దార్లకు కనక వర్షం

పేదల ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 59 కొంత మంది తహసీల్దార్లకు కాసుల వర్షం కురుస్తోంది. పొజిషన్‌లో ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఉన్నట్లుగా నిర్ధారించి రెగ్యులరైజ్ చేస్తున్నారు. ఇందుకోసం పెద్ద మొత్తంలో దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.నిజానికి 2020 జూన్‌కు ముందు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిన నివాస స్థలాలను మాత్రమే ఈ జీఓ కింద పరిగణించాలి. కానీ ఇవేవీ పట్టించుకోవడం లేదు. పసుమాముల లోని ప్రభుత్వ, లావణి పట్టా భూముల అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

నిబంధనలు పాటిస్తున్నాం

ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 59 తీసుకొచ్చారు. పసుమాముల రెవెన్యూ పరిధి నుంచి కూడా దరఖాస్తులు అందాయి. నిబంధనల ప్రకారం ఉన్న వాటిని మాత్రమే అప్రూవల్ చేస్తున్నాం. మిగిలినవి తిరస్కరిస్తున్నాం. ఎలాంటి నిర్మాణాలు లేకుండా ఖాళీగా ఉన్న భూములను రెగ్యులరైజ్ చేస్తున్నామనే ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తున్నాం.

– కలెక్టర్ హరీశ్

ఇక్కడ ఆ పార్టీలకు స్థానం లేదు

- మూడో సారీ బీఆర్ఎస్‌దే అధికారం
- మంత్రి సబితారెడ్డి
- హర్షగూడలో వంద మంది బీఆర్ఎస్‌లో చేరిక

మహేశ్వరం: తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు స్థానం లేదని, మూడో సారి కూడా బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హర్షగూడ గ్రామంలో ఉప సర్పంచ్ జే రవినాయక్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు, హర్షగూడ మాజీ సర్పంచ్ సాలీ లక్ష్మణ్ నాయక్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు, కాంగ్రెస్ పార్టీకి చెందిన మరి కొందరు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ముచ్చటగా మూడో సారి సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మహేశ్వరం గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను అధిక మెజార్టీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో భారీ చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హర్షగూడ ఉప సర్పంచ్ రవినాయక్, ఎంపీటీసీ ఎం విజయ్‌కుమార్ నాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, వార్డు సభ్యులు సభావత్ రాజు నాయక్, రాజు నాయక్, మంగమ్మ, స్వరూప, అనిత, సరోజ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి సబితారెడ్డి

తప్పుడు అఫిడవిట్‌తో..

లీగల్‌హెయిర్ సర్టిఫికెట్

- మహిళపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన బాలాపూర్ పోలీసులు

పహాడీషరీఫ్: భర్త అనారోగ్యానికి గురయ్యాడని వదిలేసి వెళ్లిన గృహిణి.. ఆయన మరణానంతరం తప్పుడు అఫిడవిట్‌తో లీగల్‌హెయిర్ సర్టిఫికెట్ పొందిన సంఘటనపై బాలాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ త్రివేణినగర్‌కు చెందిన పాపిరెడ్డి, ఇంద్రల కుమారుడు బి.మురళీకృష్ణకు.. 2016 సెప్టెంబర్ 17న నాగోల్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన అపర్ణతో వివాహం జరిగింది. డీఆర్‌డీఎల్‌లో సి- గ్రేడ్ టెక్నీషియన్‌గా పని చేసిన మురళీకృష్ణ దాంపత్య జీవితం రెండేళ్ల పాటు అన్యోన్యంగా సాగింది.2018లో ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లిన అపర్ణ.. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత మెట్టింటికి రాలేదు. ఈ విషయంలో తీవ్రంగా కలత చెందిన మురళీకృష్ణ అనారోగ్యానికి గురయ్యాడు. మంచం పట్టిన ఆయనకు.. తల్లే సర్వస్వమై సపర్యలు చేసింది. ఈ క్రమంలో ఆరోగ్యం పూర్తిగా విషమించడంతో 2022 జూలై 10న మురళీకృష్ణ మృతి చెందాడు. భర్త అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుండగా కనీసం ఇటు వైపు రాని అపర్ణ..ఆయన మరణానంతరం ఆస్తుల పై కన్నేసింది.తప్పుడు అఫిడవిట్లు సమర్పించి ము రళీ కృష్ణ ఉద్యోగం, ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేసింది.ఈ క్రమంలో బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఈ ఏడాది జనవరి 9న లీగలేయర్ సర్టిఫికెట్ సంపాదించింది.అపర్ణ తండ్రి హనుమంత్‌రావు,తల్లి రాజ్యలక్ష్మి,సోదరుడు అనిల్ కుమార్‌లు కుట్రపూరితంగా లీగల్‌హెయిర్ సర్టిఫికెట్ పొందడంపై మురళీకృష్ణ తల్లి ఏప్రిల్ నెలలో ఇచ్చిన ఫిర్యా దు మేరకు బాలాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది.

అప్రమత్తంగా ఉండండి

- పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి
- పీహెచ్‌సీల వారీగా రోజూ నివేదిక ఇవ్వాలి
- కలెక్టర్ హరీశ్
- సీజనల్ వ్యాధులపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హరీశ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, విషజ్వరాలు, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై నిత్యం పీహెచ్‌సీల వారీగా నివేదికలు సమర్పించాలన్నారు. డెంగ్యూ జ్వరాలు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు జిల్లాలోని అన్ని విద్యాలయాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని ఆదేశించారు. మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేసి సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది వివరాలు పంపండి

సాధారణ ఎన్నికల గడువు సమీపిస్తున్నందున ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు అందజేయాలని కలెక్టర్ హరీశ్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను 45 కాలమ్స్ పట్టికను సోమవారం లోగా అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ఎంపికైన రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను కలెక్టర్ ఎంపిక చేశారు. 5వ తరగతిలో 146 సీట్లకు గాను 140 మంది విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. మరో ఆరుగురిని వైటింగ్ లిస్టులో పెట్టారు. ఒకటవ తరగతిలో 138 సీట్లను ఎంపిక చేయడం జరిగిందని, మరో 10 మందిని వైటింగ్ లిస్టులో పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బలం'గా చదవాలి

- విద్యార్థుల చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ
- పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రత్యేక కార్యక్రమం
- వారంలో మూడు రోజులు రాగిజావ పంపిణీకి రంగం సిద్ధం
- జిల్లాకు చేరిన 17,100 టన్నుల రాగిపిండి
- 1.40లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- వచ్చే సోమవారం నుంచి అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల చదువుతోపాటు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పిల్లల్లో పోషక లోపాన్ని గుర్తించిన సర్కారు అధిగమించేందుకు ప్రణాళిక రూపొందించింది. వారంలో మూడు రోజులు రాగి జావను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే సోమవారం నుంచి పథకాన్ని అమలు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకొస్తోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పనకు మన ఊరు – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీని ద్వారా కోట్లాది రూపాయలు మంజూరు చేసి పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులు, సదుపాయాల కల్పన, భవన మరమ్మతులు వంటివి చేశారు. డిజిటల్ బోధనకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. వీటితో పాటు విద్యార్థుల ఆరోగ్యం కోసం బ్రేక్ ఫాస్ట్‌గా రాగి జావను అందించేందుకు శ్రీకారం చుట్టారు.

1.40లక్షల మంది విద్యార్థులకు మేలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రాగిజావ పంపిణీ నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల్లో అత్యధికంగా ప్రొటీన్ లోపం, ఎముకలు బలంగా లేకపోవడం, రక్తంలో గ్లూకోజ్ శాతం పెరుగుతుండడాన్ని గుర్తించిన ప్రభుత్వం రాగి జావ అందించాలని నిర్ణయించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రాథమిక, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు 1,362 ఉండగా వీటిలో 1.40 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికి ఉదయం పూట రాగి జావ ఇవ్వనున్నారు. దీంతో విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తి పెరగనుంది. రాగి జావ తీసుకోవడం వల్ల గుండె సమస్యలు కూడా రావు.

వారానికి మూడు రోజులు

వారంలో మూడు రోజులు సోమ, బుధ, శనివారాల్లో ఒక్కో విద్యార్థికి 40 గ్రాముల చొప్పున రాగి పిండిని నీటిలో కలిపి కాచి 200 ఎంఎల్‌గా ఇవ్వనున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలోని అన్ని ఎంఈఓ కార్యాలయాలకు రాగి పండి చేరింది. రెండు మూడు రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు. జిల్లాకు ఇప్పటికే 17,100 టన్నుల రాగి పిండి చేరింది. ప్రస్తుతం వరుస సెలవులు రావడంతో వచ్చే సోమవారం నుంచి పథకం అమలు చేయనున్నారు.



ఇబ్రహీంపట్నం ఎంఈఓ కార్యాలయానికి చేరిన రాగి పిండి

మంచి నిర్ణయం



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ఆరోగ్యం కోసం మంచి నిర్ణయం తీసుకుంది. సర్కారు స్కూళ్లను ప్రైవేటు ధీటుగా తీర్చిదిద్దుతున్నారు. చదువుతోపాటు పిల్లల ఆరోగ్యం కూడా ముఖ్యమే. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు బాగున్నాయి. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి అండగా నిలవాలి.

– ప్రశాంత్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

పిల్లల ఆరోగ్య రక్షణకే..



రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ మంచి నిర్ణయం తీసుకుంది. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కొత్త పథకాన్ని రూపొందించారు. జిల్లాలోని 1.40 లక్షల మంది విద్యార్థులకు రాగి జావ అందజేస్తాం. వారంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. దీంతో పిల్లలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు చదువుపై శ్రద్ధ పెడతారు.

– సుశీంధర్‌రావు, జిల్లా విద్యాధికారి

ఉద్యాన పంటలకు అనువు



దెబ్బడగూడలో జైపాల్ నాయక్ సాగు చేసిన అవకాడో పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

- కూరగాయలు, పండ్ల తోటలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి డాక్టర్ సునదారెడ్డి
- దెబ్బగూడలో అవకాడో పంట పరిశీలన

కందుకూరు: పండ్ల తోటలు, కూరగాయల సాగుకు రంగారెడ్డి జిల్లా అనువైన ప్రాంతమని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న అవకాడో పంటను సాగు చేసి మంచి లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి డాక్టర్ ఎస్.సునందా రెడ్డి అన్నారు. దెబ్బడగూడ పరిధిలో రైతు జైపాల్ నాయక్ ప్రయోగాత్మకంగా సాగు చేసిన విదేశీ పంట అవకాడోను బుధవారం వారు సందర్శించారు. తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా పండించిన పంటను పరిశీలించి రైతును అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అవకాడో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఫలమన్నారు. తక్కువ ఉష్ణోగ్రతలో మాత్రమే దీన్ని సాగు చేయవచ్చని భావించే వారని, ప్రస్తుతం 35- 40 డిగ్రీల ఉష్ణోగ్రతను సైతం పంట తట్టుకుని నిలబడుతుందని నిరూపితమైందని తెలిపారు. అవకాడో సాగును ప్రోత్సహించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని, ఎంత విస్తీర్ణంలోనైనా పంట వేసుకునే వీలుందని స్పష్టంచేశారు. 12.20 ఎకరాల వరకు డ్రిప్‌కు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలకు 5 ఎకరాల వరకు రాయితీ అందజేస్తున్నామని, పట్టు పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలనే రైతులు తమను సంప్రదించాలని సూచించారు.

1.10 ఎకరంలో..

అవకాడో సాగుపై రైతు జైపాల్ నాయక్ అవగాహన కల్పించాడు. యూట్యూబ్‌లో చూసి సాగు వివరాలు తెలుసుకున్నానని, నాలుగేళ్ల క్రితం జడ్చర్ల వద్ద ఉన్న నర్సరీ నుంచి మొదట మూడు రకాల అవకాడో మొక్కలను తెచ్చి నాటగా.. కేవలం వెస్టిండియన్ గ్రీన్ రకం మాత్రమే మన వాతావరణాన్ని తట్టుకుందని తెలిపారు. దీంతో 1.10 ఎకరంలో పంట సాగు చేశానని వివరించాడు. 18 అడుగులకు ఒక మొక్కను నాటానని, పంట జీవిత కాలం 60- 70 సంవత్సరాలు ఉంటుందని చెప్పాడు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులను తట్టుకునేలా చుట్టూ, మధ్యలో నీడనిచ్చే చెట్లను నాటుకోవాలని తెలిపాడు. మొక్కలకు ఎలాంటి చీడపీడలు ఆశించలేదని, కేవలం ఆవు పేడను మాత్రమే ఎరువుగా వేశానని, పంట సాగు చేయాలనుకునే రైతులకు అవగాహన కల్పిస్తానని చెప్పాడు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏడీ సంజయ్‌కుమార్, పట్టు పరిశ్రమశాఖ ఏడీ ముత్యాలు, హెచ్ఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు సర్కారు బీధీమా

- రైతుబీమా దరఖాస్తుకు ఆగస్టు 10 చివరి తేదీ
- 18 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే
- పాసు పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలిస్తే చాలు
- ఒక్కో రైతుకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్

షాబాద్: రైతుబీమా పథకానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దరఖాస్తు చేసుకోని వారు, కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఎలాంటి ప్రీమియం లేకుండా భూమి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సంబంధిత ఏఈఓకు అందజేయాలి. ఈనెల 10 వతేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఆగస్టు 5వ తేదీ వరకు గడువు విధించారు. కాగా ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ బీమా పథకం రైతు కుటుంబాలకు ఎంతో ధీమా ఇస్తోంది. ఏదైనా ప్రభుత్వ పథకం అందాలంటే పలుకుబడి ఉన్న వారికి ఆశ్రయించడమో, దళారులను నమ్ముకోవడమో వంటివి లేకుండా దీన్ని అమలు చేస్తున్నారు. ఏదైనా కారణంతో రైతు మరణిస్తే పది రోజుల్లో బాధిత కుటుంబానికి (నామినీ) రూ.5 లక్షలు అందజేస్తున్నారు. గతంలో రైతులు మరణిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడేవి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో మందికి అండగా నిలుస్తోంది.



షాబాద్ మండలం మక్తగూడలో పొలం పనులు చేస్తున్న రైతులు

ఒక్కొక్కరికి రూ.3,555 ప్రీమియం

పథకం ప్రారంభంలో ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.2,271.50 ప్రీమియంను ఎల్ఐసీకి చెల్లించింది. 2019 నుంచి ప్రీమియం పెరగడంతో ప్రస్తుతం ఒక్కో రైతుకు రూ.3,555.94 చెల్లిస్తుంది. జిల్లాలోని 27 మండలాల పరిధిలోని రైతు బీమా పథకం అమలు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన 2018 ఆగస్టు 15 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 6వేల మందికి పైగా రైతులు వివిధ కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున రూ.366.53 కోట్లు అందజేసినట్లు వ్యవసాయశాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

అంతా పారదర్శకం

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 15వ తేదీ నుంచి రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. 18 సంవత్సరాల వయసున్న రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన వారికి బీమా బాండ్లు అందజేశారు. రైతులపై ఎలాంటి ఆర్థికభారం లేకుండా ప్రభుత్వమే ఎల్ఐసీకి రైతుల పేరున బీమాకు సంబంధించిన ప్రీమియం సొమ్ము జమ చేసింది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కఠిన నిబంధనలున్నాయి. ఈ పథకంలో పేరు నమోదైన రైతు ఏ కారణంతో సొమ్ము 10 రోజుల్లో అందిస్తూ పారదర్శకతను పాటిస్తున్నారు. నామినీగా ఉన్న వారికి రూ.5 లక్షల బీమా సొమ్మును బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు.

గొప్ప పథకం



గతంలో రైతులు మరణిస్తే వారి కుటుంబాల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. రైతుల కోసం అమలు చేస్తున్న బీమా పథకం ఎందరో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రైతు మరణించిన 10 రోజుల వ్యవధిలోనే రూ.5 లక్షలు అందిస్తున్న రైతు బీమా పథకం ఎంతో గొప్ప పథకం.

– రాపోల్ నర్సింహులు, రైతు మల్లారెడ్డిగూడ

దరఖాస్తు చేసుకోవాలి



రైతు బీమా పథకానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం అందించి ఆయా గ్రామాల ఏఈఓల దగ్గర వివరాలు నమోదు చేయించుకోవాలి. రైతులు ఏదేని కారణంతో మరణిస్తే, విషయం ఫోన్‌లో సమాచారం ఇచ్చినా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పది రోజుల్లోగా నామినీగా ఉన్న వ్యక్తి బ్యాంకు ఖాతాలోల బీమా సొమ్ము రూ.5 లక్షలు జమవుతున్నాయి.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడ్తాల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి (58) మృతి చెందాడు. కడ్తాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి కొన్ని రోజులుగా బిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 25 న కడ్తాల్‌లోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట సదరు వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. ఆ వ్యక్తిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే బుధవారం చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ నిద్ర మత్తు.. కోళ్ల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన డీసీఎం వ్యాన్

చేవెళ్ల: డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా కోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కందవాడ బస్ స్టేజీ వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ నుంచి కోళ్ల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం కందవాడ బస్టేజీ వద్ద బోల్తాపడింది. డీసీఎం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో హైదరాబాద్- బీజాపూర్ రూట్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు జేసీబీ సాయంతో వాహనాన్ని పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనలో 80శాతం కోళ్లు మృతి చెందాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయలు కావడంతో వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు ఉచిత ఉద్యోగ శిక్షణకు ప్రవేశ పరీక్ష

అంబర్‌పేట: నిరుద్యోగ యువత కోసం ఉచితంగా శిక్షణ అందించి 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించడానికి పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని ఎస్‌పీఐటీ క్యాంపస్‌లో ఉదయం 9:30 గంటలకు మెగా స్క్రీనింగ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు పీసీఎఫ్ కార్యదర్శులు సందీప్ హరి, గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మువ్వ రాంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఉచిత వసతితోపాటు నిపుణులతో సంబంధిత ఉద్యోగ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

బియ్యం...షాంపూ..సర్ఫ్‌లో బంగారం


శంషాబాద్: బంగారం అక్రమ రవాణాకు కాదేది అనర్హం అన్నట్లుగా మారుతోంది అక్రమార్కుల తీరు. బియ్యం, షాంపు, సర్ఫ్‌లతో పాటు పనిముట్లలో బంగారం తీసుకొచ్చి పట్టుబడ్డారు. బుధవారం కస్టమ్స్ అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 22న దుబాయ్ నుంచి వచ్చిన నలుగురు వేర్వేరు ప్రయాణికులను తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులు వారి దుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన బంగారం బయటపడగా మరో ఇద్దరు వ్యక్తులు పనిముట్లలో దాచుకుని తీసుకొచ్చిన బంగారం బయటపడింది. మొత్తం 1 కేజీ 559 గ్రాముల బంగారం విలువ 93.28 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ నెల 23న కువైట్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద ఉన్న లగేజీని అధికారులు పరిశీలించారు. అందులో బాస్మతి బియ్యం, దుస్తులు ఉతికే సర్ఫు, షాంపులు ఉండడంతో అనుమానంతో వాటిని పరిశీలించారు. చిన్న చిన్న ఇనుప ముక్కల మాదిరిగా చేసి తీసుకొచ్చి 704 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ 42.8 లక్షలుగా నిర్ధారించారు.

సిగరెట్లు.. కరెన్సీ

బహ్రేన్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద 22 వేల విలువ చేసే 15 వేల విదేశీ సిగరెట్లు లభ్యం కాగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా హైదరాబాద్ నుంచి అల్‌ఖైమా వెళుతున్న ప్రయాణికుడి వద్ద భారత కరెన్సీలో 7.5 లక్షల విలువ చేసే సౌది కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకుని, లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఎన్ఓసీతో రూ.కోటి స్థలానికి ఎసరు

- ఫోర్జరీ సంతకాలతో నిరభ్యంతర పత్రం సృష్టి
- గ్రామ కంఠం భూమిని విక్రయించిన వ్యక్తి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సదరు వ్యక్తిపై కేసు నమోదు



పంచాయతీ లెటర్ హెడ్‌తో నకిలీ ఎన్ఓసీ

మొయినాబాద్, మొయినాబాద్ రూరల్: నకిలీ ఎన్ఓసీ సృష్టించి కోటి రూపాయల విలువైన గ్రామ కంఠం స్థలాన్ని విక్రయించిన వ్యక్తితో పాటు సబ్‌రిజిస్ట్రార్‌పై కేసు నమోదైంది. పోలీసులు, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ వివరాల ప్రకారం.. కాశీంబౌలి పంచాయతీ నజీబ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి గ్రామంలో 100 గజాల స్థలంలో ఇల్లు ఉంది. ఆయన ఇటీవల జీపీకి చెందిన నకిలీ లెటర్ ప్యాడ్ తయారు చేయించాడు. నజీబ్‌నగర్‌లో 2-34 నంబర్‌తో తనకు 302 చదరపు గజాల స్థలంలో ఉన్న ఇల్లు కూలిపోయిందని, సదరు స్థలంపై తనకు పూర్తి హక్కులు ఉంటాయని గ్రామ పంచాయతీ తీర్మానించినట్లు ఎన్ఓసీని సృష్టించాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ సంతకం, స్టాంపును ఫోర్జరీ చేశాడు. సుమారు రూ.కోటి విలువ చేసే 302 చదరపు గజాల గ్రామకంఠం స్థలాన్ని నగరానికి చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. నకిలీ ఎన్ఓసీతో ఈనెల 24న చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. గ్రామ పంచాయతీలో రిజిస్ట్రేషన్ జరిగినట్లు కార్యదర్శి మహేశ్వర్‌కు మంగళవారం సమాచారం వచ్చింది. దీంతో ఇది ఎలా సాధ్యమైందనే దిశగా ఆరా తీశాడు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ట్రూ కాపీ తీసుకోవడంతో అందులో నకిలీ ఎన్ఓసీ ఉన్నట్లు గుర్తించాడు. దీంతో సదరు వ్యక్తితో పాటు చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్‌పై మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెఉలిపారు.





వరుస వర్షాల నేపథ్యంలో మొయినాబాద్ మండలం వెంకటాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు అందాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. వరద నీటిలో జాలరులు చేపల వేట కొనసాగిస్తున్నారు. - సాక్షి, ఫొటో గ్రాఫర్

శేరిగూడలో చిరుత కలకలం

- మూడు రోజుల క్రితం చెక్‌డ్యాం వద్ద రైతుల కంటపడ్డ మృగం
- లేగదూడను చంపి తినడంతో మళ్లీ భయంభయం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని రైతులు, ప్రజలకు సూచన



శేరిగూడలో చిరుతపులి దాడిలో మరణించిన లేగదూడను చూపుతున్న రైతులు



చిరుతపులి అనవాళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: శేరిగూడ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందనే వార్తలు కలకలం రేపుతున్నాయి. మూడు రోజుల క్రితం రైతులకు కనిపించిన ఘటనను మరవక ముందే.. బుధవారం ఓ లేగదూడను చంపి, తినేసింది. దీంతో ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ, మల్‌శెట్టిగూడ అటవీ ప్రాంతం, పులందరి వాగు, చెక్‌డ్యాం సమీపంలోని రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శేరిగూడకు చెందిన క్యామ వెంకటేశ్, ఎర్రగుంట బావి మల్లారెడ్డి మూడు రోజుల క్రితం ఉదయం 6 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్తుండగా.. చెక్‌డ్యాం నుంచి బస్వన్నగుట్ట వైపు వెళ్తున్న చిరుతను కళ్లారా చూశామని చెప్పారు. ఈ విషయాన్ని గ్రామంలోకి వచ్చి అందరికీ చెప్పడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత సంచారం ఆనవాళ్లు నిత్యం తమను భయపెడుతున్నాయని చెబుతున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బుధవారం ఉదయం పులందరివాగు పక్కన గుజ్జ ప్రభాకర్‌రెడ్డి వ్యసాయ క్షేత్రంలో లేగదూడపై చిరుతదాడి చేసింది. పదిమీటర్ల దూరం ఈడ్చుకెళ్లి తినేసింది. అధికారులు, ప్రజలు మృగం ఆనవాళ్లను గుర్తించారు. దీంతో ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదు.

పరిహారం అందజేస్తాం..

శేరిగూడ సమీపంలో లేగదూడపై చిరుత దాడి చేసిన ప్రాంతాన్ని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు. బాధిత రైతుకు పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దాడికి పాల్పడింది చిరుతనా..? ఇతర జంతువులా..? అనే విషయంలో పూర్తి స్థాయి విచారణ చేస్తామని తెలిపారు.